# మన్మథరావు - వంటింటి కష్టాలు

- ఆదుర్తి బాల

**కిటికీలోంచి దూసుకొచ్చిన గ్రీష్మతాపం చుర్రుమనిపించడంతో మన్మథరావుకి హఠాత్తుగా మెలకువ వచ్చింది. ఉలిక్కిపడి టైమ్ చూసుకున్నాడు. ఎనిమిది గంటలు. రోజూ ఏడుగంటలకి నిద్రలేపి బెడ్ కాఫీ అందించే భార్యామణి త్రిపురసుందరి అలిగి పుట్టింటికి వెళ్లడంతో ఆ రోజు వంట చేసుకుని తినాలనే బాధ్యత తనమీద ఉందని గుర్తుకొచ్చింది మన్మథరావుకి.**

**'హూ... ఈ ఆడవాళ్లు ఎంత అదృష్టవంతులు. అలిగినప్పుడల్లా పుట్టింటికి వెళ్లి హాయిగా రెస్టు తీసుకుని వస్తారు. మొగుడికి ఆ అదృష్టం ఎక్కడ ఏడిసి చచ్చింది' అని నిట్టూరుస్తూ బ్రష్‌మీద పేస్టు వేసుకుని బాత్రూంలోకి నడిచాడు. దంతధావనంతోపాటు స్నానం కూడా కానిచ్చి వంటింట్లోకి అడుగుపెట్టాడు.**

వంట చేయాలనే ఉబలాటమేతప్ప పాకశాస్త్రంలో ఏమాత్రం ప్రవేశం లేదతనికి. అందుకు కారణం పుట్టి బుద్ధెరిగాక ఏనాడూ అతడికి వంట చేయాల్సిన అవసరం రాకపోవడం. అతడి చదువంతా హాస్టల్‌లోనే సాగింది.

చదువైన వెంటనే ఉద్యోగం, ఆ తరువాత పెళ్లి వెంటవెంటనే జరిగిపోవడంతో కందిపప్పుకీ సెనగపప్పుకీ తేడా తెలియని అజ్ఞానంలో ఉండిపోయాడు. అలాంటిది ఇన్నాళ్లికి భార్యామణి పుణ్యమా అని జీవితంలో మొదటిసారి గరిట తిప్పబోతున్నాడు.

ఏం చేస్తాం ఖర్మ అనుకుని కూరలేం ఉన్నాయో చూద్దామని ఫ్రిజ్ డోర్ తెరవబోతూ టైం చూసాడు... ఎనిమిదిన్నర!

'ఓర్నాయనో...తొమ్మిదింటికల్లా బైట పడకపోతే టైంకి ఆఫీసుకి చేరుకోలేడు. ఐదు నిముషాలు ఆలస్యమైనా బాసాసురుడు విరుచుకుపడతాడని గుర్తుకొచ్చి ఆ పూటకి వంటకి సెలవిచ్చి ఏదైనా హోటల్‌లో కాస్త తిని ఆఫీసుకు వెళ్లాలని నిశ్చయించుకున్నాడు మన్మథరావు.

★★★

ఆఫీసు నుంచి ఇంటికి వస్తుంటే మన్మథరావుకి దారిలో కూరలబండి కనిపించగానే ఇంటికెళ్లి వంట చేయాలన్న సంగతి గుర్తుకొచ్చింది. ఇంట్లో కూరలు ఉన్నాయో లేవో తెలీదు అతనికి. పోనీలే కొని పడేస్తే అలా పడుంటాయి అనుకుని కూరల బండికేసి నడిచాడు మన్మథరావు.

"తాజా కూరలున్నాయి రండి సార్" అంటూ అరుస్తున్నాడు బండివాడు.

నిగనిగలాడుతున్న వంకాయలను చూడగానే భార్య చేసే గుత్తివంకాయ కూర గుర్తుకు వచ్చి నోట్లో నీళ్లూరాయి మన్మథరావుకి. ఇంటికెళ్లగానే గుత్తివంకాయ కూర చేసుకుని తినాలనిపించి "ఏమిటి వంకాయులు మంచివేనా?" అన్నాడు.

బండివాడు మన్మథరావువంక ఎగాదిగా చూసి "కాయలు చూసి మాట్లాడండి సార్. లేత మొగ్గలు కనిపించడంలేదా?" అన్నాడు.

మన్మథరావు ఒకటిరెండు కాయలు తీసి పరీక్షించాడుగానీ అవి లేతవో, ముదురువో అర్థం కాలేదు అతనికి.

లేత కాయలని కూరలవాడు అంత పెద్దగా బహిరంగంగా చెబుతున్నాడు కాబట్టి అది లేతవే అయి ఉంటాయని నిశ్చయించుకుని "రేటెంత?" అన్నాడు.

"కిలో పదిహేను" అన్నాడు బండివాడు.

కొనబోయి ఆగాడు మన్మథరావు. భార్య ఇంటిముందుకొచ్చిన ఏ కూరలైనా గంటసేపు బేరం చేసి కొంటుందని గుర్తుకొచ్చి తను కూడా బేరమాడి కొనాలనుకున్నాడు.

"పధ్నాలుగున్నర ఇస్తాను" అన్నాడు.

"తీసుకోండి సార్" అన్నాడు బండివాడు ఆనందంగా.

ఇదేమిటి ఇంత తొందరగా ఒప్పేసుకున్నాడు. ఈ బండివాడు పాపం చాలా మంచివాడై ఉంటాడు.

తనే అనవసరంగా అర్థరూపాయి దగ్గర కక్కుర్తిపడి బేరమాడేసాడు అనుకుని కిలో వంకాయలు కొన్నాడు.

కాస్త దూరం పోయేసరికి ఒక ముసలివాడు తట్టలో కాసిని బెండకాయలు వేసుకుని కూర్చున్నాడు ఫుట్‌పాత్‌మీద. ఆ తాతని చూడగానే జాలేసింది మన్మథరావుకి. పాపం బేరాలేవీ రాలేదు కాబోలు అనుకుని "ఆ బెండకాలన్నీ ఎంతకిస్తావు?" అన్నాడు.

"ఐదు రూపాయలు ఇవ్వండి" అన్నాడు తాత.

ఆ బెండకాయలు ముదురువో లేతవో అర్థం కాలేదు మన్మథరావుకి. భార్య బెండకాయలు కొనేటప్పుడు చివరలు విరిచి కొనడం గుర్తుకొచ్చింది.

తను కూడా ఒక్కో బెండకాయను చివర విరిచి చూసాడు. కానీ ఎంత విరిచినా అది వంగుతోందేతప్ప విరగడంలేదు.

'మొక్కై వంగనిది మ్రానై వంగుతుందా?' అన్న సామెత గుర్తుకొచ్చింది మన్మథరావుకి. మొక్కలు లేతగా ఉంటాయి కాబట్టి వంగుతాయనీ, మానుబట్టాక విరుగుతాయేగానీ ఒంగే ఛాన్సేలేదని, బెండకాయలకి కూడా అదే రూలు

వర్తిస్తుందని, ఆ సామెతని తనదైన స్టైల్‌లో అర్థం చేసుకున్నాడు. కాబట్టి లేత బెండకాయలు ఒంగుతాయని, ముదురు బెండకాయలు విరుగుతాయని కొత్త థియరీ కనిపెట్టాడు.

తన ఎనాలిసిస్‌కి మురిసిపోతూ ఆ బెండకాయలన్నీ కొని ఇంటిదారి పట్టాడు. ఇంటికి రాగానే శుభ్రంగా స్నానంచేసి వంట ప్రయత్నం మొదలుపెట్టాడు. తనకిష్టమైన గుత్తివంకాయ కూరతో మొదలుపెడతామని వంకా



యలు తరగడానికి చాకు తీసుకుని కూర్చున్నాడు. తన ఇష్ట దైవమైన ఆంజనేయస్వామిని తలచుకున్నాడు. ఆయన బ్రహ్మచారి కాబట్టి స్వయంపాకం అలవాటు ఉండే వుంటుంది. ఆయన కూడా ఎన్నోసార్లు గుత్తివంకాయ కూర చేసుకునే వుంటాడు అనుకుని ఓ వంకాయని కట్ చేసాడు. మరు క్షణం గావుకేక పెట్టాడు.

తరిగిన వంకాయలోంచి బైటకొస్తోందో పురుగు. ఛీ...ఛీ... అనుకుంటూ ఇంకో వంకాయ తీసి తరిగాడు.

అందులోంచి ఇంకో పురుగు బయటపడింది. మన్మథరావుకి కూరల బండివాడి మీద విపరీతమైన కోపం వచ్చింది. వంకాయల్లో పురుగులు పెట్టి అమ్మి జనాలని మోసం చేసే ఇలాంటి మోసగాళ్లని శిక్షించే చట్టమేదైనా ఉందేమో లాయర్ని సంప్రదించాలి అనుకున్నాడు. తను ప్యూర్ వెజిటేరియన్. ఇలాంటి నాన్‌వెజ్ కూరలు తినకూడదనుకుని ఆ వంకాయలన్నీ పారపోసి వచ్చాడు.

అలా తన మొదటి ప్రయత్నం బెడిసికొట్టినందుకు కాస్త విచారించి పోనీలే బెండకాయ కూరైనా చేసుకుందామని అవి తరగడం మొదలుపెట్టాడు. ఎంత గట్టిగా నొక్కి కోసినా ఆ బెండకాయలు కత్తికింద నలుగుతున్నాయేగానీ తెగడంలేదు. ఇదేమిటి చెప్మా అనుకుని బహుశ కత్తికి పదును లేదేమో అనుకున్నాడు.

ఇలాంటి మొండి కత్తితో పాపం రోజూ కూరలెలా తరుగుతోందోఅని భార్య మీద జాలిపడ్డాడు. మరుక్షణం తన ఈ కష్టాలకి కారణమైన త్రిపుర సుందరిమీద కోపమొచ్చింది మన్మథరావుకి. ఆ మొండి శిఖండి గురించి అసలు తలచుకోకూడదనుకున్నాడు. కడుపులో ఎలుకలు పరుగెడుతుండడంతో కూర చేసే ప్రయత్నం మానుకుని కనీసం అన్నమైనా వండుకుంటే ఏ ఊరగాయ అయినా వేసుకుని తినవచ్చు అనుకుని బియ్యం ఏరడం మొదలుపెట్టాడు.

కానీ తను ఒక్కడికీ ఎన్ని బియ్యం వండుకోవాలో తెలియలేదు. కాసేపు బుర్రకి పదునుపెట్టి ఆలోచించగా ఓ ఐడియా తట్టింది అతనికి. తను ఎన్ని ముద్దలు అన్నం తింటాడో లెక్కగట్టి అన్ని గుప్పిళ్ల బియ్యం ఓ గిన్నెలో పోసాడు. ఆ గిన్నె నిండా నీళ్లు పోసి కుక్కర్‌లో పెట్టి హమ్మయ్య అనుకుని టీవీ ముందు సెటిలయ్యాడు.

ఇక దిగుల్లేదు టీవీ చూస్తూ అన్నం తినేయవచ్చు అనుకుంటుండగా ఫోన్ మోగింది. విసుగ్గా చూసాడు.

త్రిపురసుందరి క్షమాపణ కోరుతూ ఫోన్ చేసుంటుంది. తను ఫోన్ తీయకూడదు. ఆ మాత్రం బెట్టు చేయకపోతే భార్య లొంగిరాదు అనుకున్నాడు.

అతనికి క్రితంరోజు జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది. ఆ రోజు బాస్‌గారి భార్య ఊరెళ్లడంతో తన ఇంటికి భోజనానికి పిలిచాడు మన్మథరావు. ఆయనకి బిపి ఉందనీ వంటలో ఉప్పు, కారాలు జాగ్రత్తగా వేయమనీ చెప్పాడు భార్యతో. అయినా త్రిపురసుందరి తనదైన పద్ధతిలోనే ఉప్పు, కారం మసాలాలు దట్టించి ఘుమఘుమ లాడే వంటలు చేసి పెట్టింది.

ఈ వంట తిన్నాక బాసుగారికి బిపి పెరిగి తననెక్కడ డిస్మిస్ చేస్తారో అని భయపడి ఆ టెన్షన్‌లో ఓ నాలుగు మాటలు అంటే మాత్రం అలా కోపగించుకుని పుట్టింటికి వెళ్లిపోవడమేనా? తన అదృష్టం బాగుంది ఏమీ అనలేదు బాసు. ఆడదానికే అంత పంతముంటే మగాడిని తనకెంత ఉండాలి అనుకున్నాడు మన్మథరావు.

ఫోన్ ఆగకుండా మోగుతుండడంతో విధిలేక ఫోన్ తీసాడు. ఫోన్‌లో బాస్‌గారి కంఠం వినగానే అల్లర్టైపోయాడు మన్మథరావు. 'అయిపోయింది అంతా అయిపోయింది. ఆఫీసులో తనని డిస్మిస్ చేసే టైమ్ లేక ఫోన్‌లో ఆ సంగతి చెప్తాడు కాబోలు అనుకుని బాసుగారినుంచి వచ్చే తిట్లు తినడానికి బ్రైన్ ట్యూన్‌చేసుకుని "హలో సార్" అన్నాడు మన్మథరావు వణుకుతున్న కంఠంతో.

"ఏమిటోయ్ మన్మథరావు... ఇందాకటినుంచీ ఫోన్ చేస్తుంటే తియ్యావు. ఏదైనా ముఖ్యమైన పనిలో ఉన్నావా? మళ్లీ ఫోన్ చేయమంటావా?" ఎప్పుడూ గాండ్రించే పులిలా గుర్రుమనే బాసు గొంతు కోకిల స్వరంగా మధురంగా వినిపించేసరికి ఆశ్చర్యపోయాడు మన్మథరావు.

"అబ్బే పనేమీ లేదు సార్ చెప్పండి" అన్నాడు.

"మరి ఇందాకటినుంచీ ఫోన్ చేస్తుంటే తియ్యవేమయ్యా" అన్నాడు బాసు.

"అదీ...అదీ..." ఏం చెప్పాలో తెలియక నీళ్లు నమిలాడు మన్మథరావు.


మన్మథరావు సణుగుడిని మరోలా అర్థం చేసుకున్నాడు బాసు.

"ఓహ్...సారీనయ్యా మన్మథరావు. మీ ఏకాంతాన్ని భగ్నం చేసినట్టు



## నిజమేనందారా?

సల్మాన్ ఖాన్ సిగరెట్‌లు తాగడం మానేశాట్ట. 'అవును నిజమండీ, నేను సిగరెట్లకి గుడ్‌బై చెప్పేసాను. అఫ్‌కోర్స్ గతంలోనూ ఇలాగే చేసినా మాట మీద నిలబడలేకపోయాను. కానీ ఈసారి ఎలాగైనా వాటిని ముట్టుకోకూడదని సీరియస్‌గా అనుకుంటున్నాను' అంటున్నాడు. ఆరోగ్యరీత్యా పొగతాగడం మానేయమని వైద్యులు చెప్పడం మీదట సల్మాన్ ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడని అతని సన్నిహితులు చెప్పుకుంటున్నారు. ఆమధ్య షారుఖ్ కూడా సిగరెట్లకి గుడ్‌బై అన్నాడు. మళ్లీ ఎంచక్కా వాటిని ఉఫ్ ఉఫ్‌మని ఊదేయడం మొదలెట్టాడు. సల్మాన్ సంగతి చూడాలి మరి!



న్నాను'' అన్నాడు.

తన మొహానికి అంత అదృష్టం కూడానా? అనుకుని "అదేం లేదు సార్... చెప్పండి సార్'' అన్నాడు మన్మథరావు.

"ఏంలేదు మన్మథరావు. నిన్న మీ ఆవిడ చేసిన వంట అద్భుతంగా ఉంది. ప్రాణం లేచొచ్చిందనుకో. నన్నో బిపి పేషెంట్‌లా ట్రీట్ చేసి మా ఆవిడ చేసే చప్పిడి కూరలు తినీ తినీ జిహ్వ చచ్చిపోయిందనుకో. నువ్వే మనుకోనంటే మళ్లీ మీ ఇంటికొచ్చి మీ ఆవిడ చేతివంట తినాలని ఉందోయ్'' అన్నాడు బాసు.

"ష్యూర్...ష్యూర్...తప్పకుండా సార్'' అన్నాడు మన్మథరావు పులకించిపోతూ.

"అన్నట్లు నీకో శుభవార్త. నిన్ను సెక్షన్ ఆఫీసర్‌గా ప్రమోట్ చేయమని రికమెండ్ చేయాలనుకుంటున్నానోయ్'' అని ఫోన్ పెట్టేసాడు బాసు.

తన చెవులని తానే నమ్మలేకపోయాడు మన్మథరావు.

ఇంతలో తలుపు చప్పుడైంది. తలుపు తీసి చూసాడు మన్మథరావు.

ఎదురుగా భార్య... బాలాత్రిపురసుందరి కన్నుల పండుగగా కనిపించింది. ఏమిటీ... ఈ రోజు తనకు పాకులమీద పాకులు అనుకున్నాడు మన్మథరావు.

"జరగండి... నేను లోపలకు రావాలి'' అంటూ భర్తని తోసుకుని లోపలకు వచ్చింది త్రిపుర సుందరి.

వస్తూనే నాలుగువైపులా వంటిల్లు కలియజూసింది. మన్మథరావు తరగబోయి సాధ్యం కాక అలా వదిలేసిన బెండకాయల్ని చూసి కిసుక్కున నవ్వింది.

"ఈ ముదురు బెండకాయలు తమరి నిర్వాకమేనా?'' అంది.

"అవి లేతవి. బాగానే పరీక్షించాకే కొన్నాను'' అన్నాడు మన్మథరావు.

"ఔనా... ఇంకో నాలుగురోజులు పోతే విత్తనాలకి పనికొచ్చేవి'' అన్నది త్రిపురసుందరి.

"నిజమా... మరి ఆ తాత ఆ సంగతి చెప్పలేదే'' అన్నాడు మన్మథరావు.

"ఎవరూ... ఆ బెండకాయలు అమ్ముకునే తాతా? ఎవ్వరైనా తన దగ్గరున్న కూరలు ముదురువని చెప్తారా?'' అన్నది త్రిపురసుందరి వస్తున్న నవ్వును ఆపుకుని కోపం నటిస్తూ.

"నీ పట్టుదల మానుకుని వచ్చినందుకు చాలా థాంక్స్'' అన్నాడు మన్మథరావు టాపిక్ మార్చడానికి ప్రయత్నిస్తూ.

"ఆ థాంక్స్ నాక్కాదు. మా బామ్మకి చెప్పండి'' అన్నది త్రిపుర సుందరి.

"మీ బామ్మకు శతకోటి వందనాలు. ఇంతకీ ఏమందేమిటి ఆవిడ?'' అన్నడు మన్మథరావు.

"భార్యాభర్తల మధ్య వచ్చే పొరపొచ్చాల సెగ చలిమంటలా వెచ్చగా ఉండాలేగానీ కార్చిచ్చులా కాపురాలు కాల్చేయకూడదని చెప్పింది. అందుకే రాజీ పడి వచ్చాను'' అన్నది త్రిపురసుందరి.

"జరిగినదాంట్లో నాదీ తప్పుంది సుందూ... ఏదో కోపంలో ఏవేవో అనేసాను నన్ను క్షమించు''

"అయ్యో మనలో మనకి క్షమాపణలేమిటండీ. ఇప్పటికే ఆలస్యం అయింది. పది నిముషాల్లో వంట చేసేస్తాను. హాయిగా భోజనం చేద్దాం'' అంటూ వంటింట్లోకి వెళ్లబోయింది త్రిపురసుందరి.

"ఆ శ్రమ నీకు అక్కర్లేదు. నేను అన్నం వండేసాను. నిజానికి నా ఒక్కడి వరకే లెక్కకట్టి వండుకున్నాననుకో. అర్ధాంగివి కనుక ఆ వండుకున్న అన్నాన్నే నీకూ షేర్ చేస్తాను పద'' అన్నాడు మన్మథరావు.

"మీరు అన్నం వండారా?'' ఆశ్చర్యంగా అంటూ అనుమానంగా చూస్తూ కుక్కర్ మీద మూత తీసి చూసింది త్రిపురసుందరి. ఆ కుక్కర్ గిన్నె నిండుగా ఘన, ద్రవ పదార్థాలకి మధ్యస్థంగా ఉండే జెల్లీలాంటి పదార్థాన్ని చూసి పకపకా నవ్వేసింది త్రిపురసుందరి. బిక్కమొహం వేసుకుని వండిన గిన్నె వంక చూసాడు మన్మథరావు.


"ఈ పూటకి ఇంక వంటా వార్పూ ఏమీ వద్దుగానీ త్వరగా పద ఏ హోటల్కైనా పోదాం'' అన్నాడు మన్మథరావు.

ఇద్దరూ హోటల్ నుండి తిరిగొస్తుంటే అన్నాడు మన్మథరావు "నాకు త్వరగా ప్రమోషన్ రాబోతోంది. దానికి కారణం మా బాసుని మెప్పించిన మీ చేతివంటే. మళ్లీ నీ చేతి వంట తినడానికి వస్తానన్నాడాయన''

"తప్పకుండా రమ్మనండి'' అంది త్రిపురసుందరి.

హాయిగా నవ్వుకున్నాడు మన్మథరావు. చక్కగా సహకరించే భార్య పక్కనే ఉందిగా మరి!

★



## సోలార్ ప్లేన్

స్విట్జర్లాండ్‌కి చెందిన బెర్ట్రాండ్ పికార్డ్ పూర్తిగా సోలార్ పవర్ ఇంధనంతో నడిచే ప్రోటోటైప్ (నమూనా) విమానాన్ని ఇటీవల తయారు చేయించాడు. దీనిలో 24 వేల సోలార్ సెల్స్‌ని ఉపయోగించారుట. గత ఆరేళ్లుగా 50 మంది ఇంజనీర్లు, టెక్నీషియన్లు కలసి దీనిని తయారు చేసారుట. 2010 నాటికి కమర్షియల్‌గా ఈ విమానాన్ని తయారు చేయవచ్చునంటున్నాడు పికార్డ్. ఇతను 1999లో ఒక్కడూ హాట్ ఎయిర్ బెలూన్‌లో ప్రపంచాన్ని చుట్టి వచ్చిన సాహసి.

-తటవర్తి

